
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
5
శనివారం 23 నవంబరు 2024



ఎయిడ్స్‌ను నిర్మూలిద్దాం

- యువత మేలుకోవాలి
- క్షణికావేశంతో జీవితం బుగ్గిపాలు
- అదనపు డీఎంఅండ్ హెచ్ఓ సగిలి రవిబాబు



ఫటాఫట్

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎయిడ్స్‌ను నిర్మూలించేందుకు అందరూ సహకరించాలని జిల్లా అదనపు ఆరోగ్యశాఖాధికారి, లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ కంట్రోల్ అధికారి సగిలి రవిబాబు పిలుపునిచ్చారు. యువత మేలుకోవాలని, క్షణికావేశంతో జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దని సూచించారు. ఎయిడ్స్‌కు సంబంధించి ఆంధ్రజ్యోతి అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఫటాఫట్ సమాధానాలు..

ప్రశ్న: జిల్లాలో ఎయిడ్స్ బాధితులు ఎంత మంది?

జవాబు: జిల్లాలో 10 వేల వరకు ఎయిడ్స్ కేసులు ఉన్నాయి. ప్రతి నెలా రిమ్స్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌లో 9 వేల మంది వరకు వైరల్ లోడ్ చెకప్, సీడీ-4 కౌంటింగ్ పరీక్షలు చేసుకుంటున్నారు.

ప్రశ్న: ఎయిడ్స్ వ్యాప్తికి కారణాలు

జవాబు: ఇంటర్నెట్, మొబైల్‌లలో అశ్లీల చిత్రాలు చూడడంతో నేటి యువత చెడిపోతున్నారు. డ్రగ్స్ గంజాయి, ఆల్కహాల్‌తో పాటు నిద్రమాత్రలు, వైట్‌నర్, సొల్యూషన్ వంటి మందుల మత్తుకు యువత బానిసలుగా మారుతున్నారు. మత్తులో క్షణికావేశంతో సురక్షితం కాని పార్టనర్లతో కలవడం వలన ఎయిడ్స్‌బారిన పడుతున్నారు. ఇలాంటివారిలో ఎక్కువ మంది యువతే ఉండటం విచారకరం.

ప్రశ్న: ఎక్కువగా ఏ ప్రాంతాల్లో నమోదు అవుతోంది

జవాబు: జిల్లాలో నాలుగు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ కేసులు ఉన్నాయి. ట్రాన్స్‌జెండర్స్, మేల్ సెక్స్‌వర్కర్ల వల్ల కూడా హెచ్‌ఐవి సోకే ప్రమాదం ఉంది.

ప్రశ్న: నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు?

జవాబు: ఎయిడ్స్, హెచ్‌ఐవి నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా కళాజాతా బృందాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అలాగే జిల్లా స్థాయిలో మేనేజరుతో పాటు ఐదుగురు బృందంతో అన్ని డివిజన్లలో ఎన్‌జీవో సంఘాలు, భవ్య అనే సంఘం సహకారంతో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేశాం.

ప్రశ్న: నిర్ధారణ పరీక్షలు ఎక్కడ చేస్తారు

జవాబు: అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లలో రక్త పరీక్షలు నిర్వహిస్తారు. పాజిటివ్‌గా నమోదైతే వారిని రిమ్స్ ఏఆర్‌టీ సెంటర్‌కు రెఫర్ చేస్తారు. వారికీ మూడు రకాల పరీక్షలు చేయడంతో పాటు ఎలీషా పరీక్షలో నిర్ధారణ అయితే పాజిటివ్ కేసుగా నమోదు చేస్తాం.

ప్రశ్న: వారి జీవనప్రమాణం పెంచే మందులు ఉన్నాయా

జవాబు: హెచ్‌ఐవి, ఎయిడ్స్ బారిన పడ్డ వారి జీవన ప్రమాణం పెంచేందుకు ప్రభుత్వం మంచి మందులు అందజేస్తోంది. సకాలంలో మందులు వాడడం, ప్రొటీన్లతో కూడిన ఆకు కూరలు, పప్పుదినుసులు, కూరగాయలు తినడం వల్ల శారీరక సామర్థ్యం పెంచుకోవచ్చు. జీవన ప్రమాణం కూడా పెంచుకోవచ్చు. ఈ వ్యాధి సోకినా 45 ఏళ్లుగా జీవించి ఉండేవారు ఉన్నారు.

పెండింగ్ నిర్మాణాలను పూర్తిచేయండి

- హౌసింగ్ పీడీ రాజారత్నం



కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న పీడీ రాజారత్నం

పులివెందుల రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని హౌసిం గ్ పీడీ రాజారత్నం సూచించారు. శుక్రవారం హౌసింగ్ డీఈ రమణారెడ్డి, డీఈసీ ఏజెన్సీ ప్రతినిధి శ్రీనివాస్‌తో కలిసి మెగా లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాలు ఏయే దశలో ఉన్నాయో పీడీ అడిగి తెలుసుకున్నా రు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. పెం డింగ్ బిల్లులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, హౌసింగ్ సిబ్బంది, వార్డు ఎమినిటీ కార్యదర్శులతో పెండింగ్ బిల్లులపై చర్చించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఏఈ రామసూరారెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రూ.3.66 కోట్లతో సీపీ బ్రౌన్ భవన నిర్మాణం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ మెమోరియల్ లైబ్రరీ అభివృద్ధిలో భాగంగా రూ.3.66 కోట్లతో నూతన భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. పనులను ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ డబ్ల్యూఐడీసీ)కు అప్పగించినట్లు తెలిపారు. శుక్రవారం వీసీ చాంబర్‌లో వీసీ క్రిష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, ఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీర్ గురివిరెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అసెంబ్లీ సాక్షిగా..

జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఐదేళ్ల తర్వాత శాసన సభ, శాసన మండలి సాక్షిగా జిల్లా జనం గొంతుకై మన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వానికి జనం తిరుగులేని ఆధిక్యతను కట్టబెట్టారు. ఓటర్ల విశ్వాసాన్ని వమ్ముచేయకుండా మనోళ్లు శాసనసభ, మండలిలో వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. పరిష్కారం అయ్యే చోటనే సమస్యలను ప్రస్తావించి ఓట్లేసిన జనం మనసులను ప్రస్తుతానికి మెప్పించారు. ప్రస్తావించడం మాత్రమే కాదు.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కరించాల్సిన బాధ్యత కూడా వారిదే అని జనం సూచిస్తున్నారు. అయితే ఈ సమావేశాలకు మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ గైర్హాజరయ్యారు.

మన వాణి



- జనం తరపున సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు
- హాజరుకాని పులివెందుల, బద్వేలు ఎమ్మెల్యేలు జగన్, సుధ
- మండలిలోనూ సమస్యలపై ప్రశ్నించిన ఎమ్మెల్సీలు

(కడప-ఆంధ్రజ్యోతి): చాలా ఏళ్ల తర్వాత అటు అసెంబ్లీ, ఇటు మండలిలో కడప జిల్లా సమస్యలను ఎమ్మెల్యేలు ప్రస్తావించి.. ఓట్లేసిన జనం వావ్ మన వాళ్లు మా కోసం పోరాడుతున్నారు అనే భావన కల్పించారు. బడ్జెట్ సందర్భంగా నిర్వహించిన అసెంబ్లీ, మండలి సమావేశాల్లో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వచ్చిన అవకాశాలను వినియోగించుకుని సమస్యలకు పరిష్కారవేదిక అయిన అసెంబ్లీ, మండలి దృష్టికి తీసుకెళ్లారు. వైసీపీ హయాంలో జగన్ సీఎంగా ఉండడం.. జిల్లాలో అందరు ఎమ్మెల్యేలు ఆ పార్టీవారే కావడంతో అసెంబ్లీలో జిల్లా సమస్యల గురించి చర్చించే పరిస్థితి లేకపోయింది. కేవలం భజనకే పరిమితమయ్యారు. అయితే ఈసారి కూటమికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసీపీ ఎమ్మెల్సీలు కూడా జనం తరపున, జనం గొంతుకై మాట్లాడారు. ఎవరెవరు ఏమేమి మాట్లాడారని పరిశీలిస్తే..

కడప తాగునీటి సమస్య పరిష్కరించండి..



కడప నగరంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉంది. ఇక్కడ 20 ఏళ్లుగా కాంగ్రెస్, వైసీపీ వారే ఎమ్మెల్యేలు ఉన్నప్పటికి తాగునీటి సమస్య పరిష్కరించలేదు. కడప జనాభాకు ప్రతిరోజు 80ఎంఎల్‌డీ నీరు అవసరం. అయితే 40ఎంఎల్‌డీల నీరు మాత్రమే ఉంది. ఇక్కడ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు లేవు. వేసవి వస్తోంది. కడప నగరంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టండి. వైసీపీ హయాంలో కడప యువత గంజాయి మత్తుకు అలవాటుపడింది. మత్తుకోసం ప్రమాదకరమైన మెడిసిన్ వాడుతున్నారు. దీనిని అరికట్టాలి. ఇక కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు శుభ పరిణామం. దీంతో రాయలసీమ రూపురేఖలు మారుతాయి.

- ఆర్.మాధవి, ఎమ్మెల్యే, కడప

జీఎన్ఎస్ఎస్‌తో సాగు, తాగునీరు..



జీఎన్ఎస్ఎస్ పూర్తిచేస్తే 80వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కడప కార్పొరేషన్‌కు తాగునీటితో పాటు కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీరు ఇవ్వచ్చు. నేరుగా నీటిని తీసుకెళ్లచ్చు. ఒక్కపైసా మెయింటెనెన్స్ ఖర్చు ఉండదు. దీనిని త్వరగా పూర్తిచేస్తే కడప, కమలాపురం తాగునీటి అవసరాలతో పాటు కొప్పర్తి పారిశ్రామిక వాడకు నీరు వస్తుంది. దీనితో సాగు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు వస్తుంది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు మంచి విషయం. ఏసీబీ కోర్టు, ట్రిబ్యునల్ కోర్టు కడపలో ఏర్పాటుచేస్తే సీమవాసులందరికి అందుబాటులో ఉంటుంది.

- పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

కరువు మండలాల్లో జిల్లాకు అన్యాయం..



కరువు మండలాల ఎంపికలో జిల్లాకు అన్యాయం జరిగింది. వైసీపీ హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో కరువు వచ్చింది. ఒక్క మండలాన్ని కూడా కరువు జాబితాలో చేర్చలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లా అధికారులు కరువు మండలాల జాబితాను పంపించారు. మళ్లీ ఒక్క మండలాన్ని కూడా ప్రకటించలేదు. జగన్ చేపట్టిన భూరీసర్వే వల్ల సమస్యలు వచ్చాయి. రైతులకు అడంగల్ రావడం లేదు. దీనితో బ్యాంకు రుణాల రెవన్యూల్‌కు చాలా ఇబ్బందిగా ఉంది. జగన్ హయాంలో రూ.5300కోట్లతో జీఎన్ఎస్ఎస్ పనులు చేపట్టారు. 2024 మార్చిలోపే పూర్తికావాల్సి ఉంది. అయితే కేవలం 22శాతమే పూర్తిచేశారు. దీనిని త్వరగా పూర్తిచేయాలి. ఇక ఆర్డీడీ రాఘవరెడ్డి అక్రమాలపై విచారణచేయించాలి.

- భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ

గండికోట నిర్వాసితులకు న్యాయం చేయండి..



గండికోట నిర్వాసితులకు గత టీడీపీ హయాంలో రూ.6.70లక్షలు ఇచ్చారు. జగన్ రూ.10లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. 14గ్రామాల ప్రజలకు రూ.3.30 లక్షల చొప్పున దాదాపు రూ.400కోట్లకు పైగా ఇవ్వాల్సి ఉంది. బడ్జెట్‌లో నిధులు కేటాయించి న్యాయం చేయాలి. రాజోలి ఆనకట్టకు 4 వేల ఎకరాల భూములు అవార్డు అయ్యాయి. వాటికి గత ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదు. దీనితో రైతులు ఆ భూములు ఎవరికీ అమ్ముకోలేని పరిస్థితి. పాదయాత్రలో లోకేశ్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆ రైతులకు పరిహారం పెంచి ఇవ్వాలి. ఇక వంకను ఆక్రమించి దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీ కట్టారు. మైలవరం జలాశయం ప్రధాన కాల్వలు చెట్లతో నిండిపోయాయి. ఉపాధి హామీ నిధులతోనైనా వీటిని శుభ్రం చేయాలి.

- పి.రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ, వైసీపీ

చరిత్రలో నిలిచిపోతారు..



కుందూ నదిపై రాజోలి జలాశయం నిర్మిస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చరిత్రలో నిలిచిపోతారు. ఈ ప్రాజెక్టు కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. కానీ ఎలాంటి పనులూ జరగలేదు. కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తే మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, కడప నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. దీంతో జిల్లాలో కరువు దాదాపు నివారించవచ్చు.

- పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్యే, మైదుకూరు

నర్సింగ్ విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపండి..



ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని పెద్దశెట్టిపల్లెలో శ్రీనివాస ఫార్మసీ కళాశాల ఉంది. ఇక్కడ మూడు వందల మంది విద్యార్థులు ఉన్నారు. అయితే కరస్పాండెంట్ అప్పులపాలై రాజమండ్రికి వెళ్లిపోయారు. కళాశాలలో అధ్యాపకులు లేరు, విద్యాబోధన లేదు, 300 మంది విద్యార్థులు ఉన్నారు. అక్కడ ఎలాంటి వసతులు లేవు. ఈ విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపాలి. వీరిని ఏ కళాశాలకు అయినా పంపించి విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలి.

-ఎన్.వరదరాజులరెడ్డి, ఎమ్మెల్యే, ప్రొద్దుటూరు

మెడికల్ కళాశాలను ప్రారంభించాలి..



పులివెందుల మెడికల్ కళాశాలలో అన్ని వసతులు కల్పించి వచ్చే విద్యా సంవత్సరంలో వంద మెడికల్ సీట్లలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. ఎన్ఎంసీ అనుమతుల మేరకు అన్ని వసతులు ఏర్పాటుచేయాలి.

- రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ, వైసీపీ

ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలి

- ప్రైవేటుకు ప్రభుత్వ భూమి ఇచ్చే హక్కు రెవెన్యూకు లేదు
- ఆర్డీవోలు, తహశీల్దార్ల సమీక్షలో కలెక్టర్




మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పని చేయాలని, ప్రభుత్వ భూమి ఒక్క అడుగు కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే హక్కు రెవెన్యూకు లేదని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్‌హాల్లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలసి ఆర్డీవోలు, తహశీల్దార్లతో భూముల రీసర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ, ఫ్రీహోల్డ్ భూములు, భూ సేకరణ, రెవెన్యూ శాఖలో పెండింగ్ అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ భూముల కేటాయింపు విషయంలో ప్రాథమిక విధులను విస్మరించరాదన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి పౌరసేవ ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలన్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి ప్రతి రెవెన్యూ కార్యాలయంలో ఈ-ఆఫీసు నిర్వహణ పక్కాగా జరగాలన్నారు. ప్రధానంగా రెవెన్యూశాఖలో ఎక్కడా పెండింగ్ అంశాలు కనిపించకూడదన్నారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణ, మ్యుటేషన్స్, ఆర్ఓఆర్, ఎంక్రోచ్‌మెంట్స్, వెబ్ ల్యాండింగ్, రీసర్వే పనులను ఆర్డీవోలు, తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో నిర్దేశిత లక్ష్యం మేరకు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో ప్రతి అంశానికి సంబంధించి ఫైల్ రికార్డు నిర్వహణ కచ్చితంగా చేపట్టాలన్నారు. కార్యాలయాల్లో ఏ అధికారి మారినా రికార్డుల నిర్వహణ మారకూడదన్నారు. ఎక్కడైనా రికార్డులు లేవని ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. నిర్లక్ష్యం, అలసత్వం, దుర్వినియోగం జరిగిందని తన దృష్టికి వస్తే సహించేది లేదన్నారు. వారానికి 3 గ్రామ సభలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, భానుశ్రీ, చంద్రమోహన్, సర్వే ఏడీ మురళీకృష్ణ, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'సాగునీటి' సమరం

- సాగునీటి సంఘాలకు 5న నోటిఫికేషన్
- 11వ తేదీన ఎన్నిక
- జిల్లాలో 205 సంఘాలకు జరగనున్న ఎన్నికలు
- ఎన్నికల ప్రక్రియలో అధికారులు బిజీబిజీ

సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగనుంది. వచ్చే నెల 5న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూలు ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గత నెలలోనే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఓటర్ల జాబితా కూడా తయారు చేసింది. అయితే అర్ధంతరంగా ఎన్నికలు వాయిదా పడ్డాయి. తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో మొత్తం 205 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతోంది.



(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో టీడీపీ హయాంలోనే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. ఈ సంఘాలకు కాల వ్యవధి ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. తిరిగి చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూలు ప్రకటించింది. చెరువులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్, ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు ఉన్న రైతుల నుంచి ప్రాదేశిక మెంబర్లను ఎన్నుకుంటారు. వారి నుంచే చైర్మన్, వైస్ చైర్మన్లను ఎంపిక చేస్తారు. దీంతో ఆయా చెరువులు, ప్రాజెక్టులు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ చెరువుల అభివృద్ధి బాగోగులు కమిటీ చూసుకుంటుంది. కాల్వల్లో పూడికతీత, గట్టు పటిష్ఠత, ఇతరత్రా అభివృద్ధి పనులను కమిటీ ఆధ్వర్యంలో చేపడతారు. దీని వల్ల రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది. ఇందులో భాగంగా సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలు ఇలా..

జిల్లాలో 205 సాగునీటి సంఘాలున్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 112 ఉండగా మీడియం 76 ఉన్నాయి. ఇక డివిజనల్ వారీగా చూస్తే కడప రెవెన్యూ డివిజనులో 47 చెరువులు, బద్వేలులో 70, జమ్మలమడుగులో 56, పులివెందులలో 32 ఉన్నాయి. మీడియం పరిధిలో ఎల్ఎస్‌పీ, ఈఎస్‌పీ, మైలవరం, కేసీ కెనాల్, పులివెందుల బ్రాంచ్ కెనాల్‌తో పాటు పెద్దముడియం మండలంలో ఎస్ఆర్‌బీసీకి సంబంధించి ఒక సాగునీటి సంఘం ఉంది. మైనర్ ఇరిగేషన్‌లో ఒక్కో సాగునీటి సంఘానికి ఆరుగురు ప్రాదేశిక సభ్యులను ఎన్నుకుంటారు. మేజరుకు 12 మందిని ఎన్నుకుంటారు. వీరి నుంచే ప్రెసిడెంటు, వైస్ ప్రెసిడెంటును ఎన్నుకుంటారు.

ఇవీ నిబంధనలు..

ప్రాదేశిక సభ్యులుగా పోటీ చేసేవారు నీటి పన్ను చెల్లించాల్సి ఉంది. అప్పు ఉండకూడదు. ఏదైనా కేసులో శిక్ష అనుభవించకూడదు. తొలుత ఆయా సాగునీటి సంఘాల పరిధిలో రైతులతో అధికారులు సమావేశం అవుతారు. రైతులంతా ఏకాభిప్రాయానికి వస్తే ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. పోటీ ఉంటే ఎన్నికలు నిర్వహిస్తారు. తొలుత ప్రాదేశిక సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం లోపు ఆ తంతు పూర్తి చేస్తారు. తరువాత 3 నుంచి 5 గంటల లోపు ఆ సభ్యుల నుంచి సాగునీటి సంఘం ప్రెసిడెంటు, వైస్‌ప్రెసిడెంటును ఎన్నుకుంటారు. ఎన్నికలో 50శాతం కోరం ఉండాలి.

ఇప్పటికే శిక్షణ పూర్తి

జిల్లాలో కేసీ కెనాల్ పరిధిలో 32 సాగునీటి సంఘాలున్నాయి. టీబీసీలో 16, మైలవరంలో 8, లోయర్ సగిలేరు, అప్పర్ సగిలేరు ప్రాజెక్టులో 16 సంఘాలున్నాయి. ఎస్ఆర్‌బీసీకి సంబంధించి పెద్దముడియం మండలంలో ఒకసాగునీటి సంఘం ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి గత నెలలోనే కసరత్తు పూర్తయింది. చెరువులు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలో ఉండే ఓటర్లజాబితా సిద్ధమైంది. అయితే ఇంకా పూర్తి స్థాయిలో జిల్లా కేంద్రానికి అందలేదు. ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండడంతో ఓటరు జాబితా పూర్తి చేయనున్నారు. డిసెంబరు 5న నోటిఫికేష్ విడుదల చేస్తారు. 11న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సారి సాగునీటి సంఘం ఎన్నికలను ఆషామాషీ కాకుండా ప్రభుత్వం సాధారణ ఎన్నికల తరహాలోనే నిర్వహించనుంది. ఒక్కో సాగునీటి సంఘానికి పోలీసు ఆఫీసరు, అసిస్టెంటు పోలీసు ఆఫీసరును నియమిస్తుంది. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి శిక్షణ కూడా పూర్తి చేశారు.

కూటమి వర్సెస్ వైసీపీ

ఇప్పుడు ఏ ఎన్నికలు జరిగినా రాజకీయం ఉంటుంది. సాగునీటి సంఘాలైనా, హౌస్ బిల్డింగ్ సొసైటీ అయినా ఏదైనా సరే.. పార్టీల ముద్ర తప్పనిసరిగా ఉంటుంది. ఇప్పుడు జరగబోయే సాగునీటి సంఘం ఎన్నికలు కూడా కూటమి వర్సెస్ వైసీపీగా మారనున్నాయి. సార్వత్రిక ఎన్నికలయ్యాక ఐదు నెలల తరువాత తొలిసారిగా సాగునీటి సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను కూటమి ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సొంత జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో అయినా పట్టుకోసం వైసీపీ సహజంగా పోరాటానికి సిద్ధమవుతుంది. అదే విధంగా సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాలతో అదే ఊపును సాగునీటి సంఘాల్లో చూపించి గెలుచుకునేందుకు కూటమి సిద్ధమవుతోంది. మొత్తానికి సాగునీటి సంఘాల ఎన్నికలతో పల్లెల్లో పొలిటికల్ హీట్ నెలకొననుంది.

ఓటరుగా నమోదు చేసుకోండి



- నేడు, రేపు బూత్‌ల వారీగా ప్రత్యేక క్యాంపులు
- 6 నెలల్లో 2,287 మంది కొత్త ఓటర్లు

నేడు, రేపు బూత్‌ల వారీగా ఓటు నమోదు

కడప కలెక్టరేట్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వజ్రాయుధం. అలాంటి ఓటు నమోదు విషయంలో అర్హులైన ఓటర్లు ఎన్నికలు ఐదేళ్లకు కదా అని తాత్సర్యం చేస్తున్నారు. దీంతో ఎన్నికల సమయంలో అధికారులకు తిప్పలు తప్పడం లేదు. కొత్తగా ఓటు నమోదు, చనిపోయిన, వలస ఓటర్ల తొలగింపులు, చిరునామాల మార్పుచేర్పుల విషయంలో రాజకీయ పార్టీలు, బూత్‌లెవల్ ఏజెంట్లు, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటరు జాబితా రూపొందించడం ఎన్నికల యంత్రాంగానికి సవాలుగా నిలిచింది. రాజకీయ పార్టీల ఆరోపణల నేపథ్యంలో ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణకు నానా తంటాలు పడ్డారు. 18 ఏళ్లు దాటిన వారు ఎప్పటికప్పుడు ఓటు నమోదు చేసుకోవడం, చనిపోయిన వలసపోయిన వారిని గుర్తించి ఎప్పటికప్పుడు తొలగింపులు చేస్తే ఎన్నికల నాటికి ఎవరికీ ఇబ్బంది ఉండదు. కాగా.. గత ఎన్నికల నాటికి జిల్లాలో 16,39,066 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జిల్లాలో కొత్త ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియగా సాగడంతో అక్టోబరు 29 నాటికి రాష్ట్ర ఎన్నికల సంఘం డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసింది. మళ్లీ కొత్తగా ఓటర్లు 2,287 మంది నమోదు చేసుకోవడంతో జిల్లాలో ప్రస్తుత ఓటర్ల సంఖ్య 16,41,353కు చేరుకుంది

బూత్ స్థాయిలో ఓటు నమోదు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్తగా ఓటు నమోదు, అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల సవరణలకు సంబంధించి దరఖాస్తులను శని, ఆదివారాల్లో బీఎల్వోలకు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని కడప తహశీల్దారు నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కడప నియోజక వర్గంలో 2,84,220 మంది ఓటర్లు ఉన్నారని, 268 పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోలు రెండు రోజుల పాటు ప్రత్యేక క్యాంపుల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు కోరారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని,ఆదివారాల్లో జిల్లా వ్యాప్తంగా 1,963 పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అధికారులు, రెవెన్యూ యంత్రాంగం కొత్త ఓటర్ల నమోదుకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వనుంది. అంతే కాకుండా ఏవేని అభ్యంతరాలు, చని పోయిన, వలస ఓటర్ల తొలగింపులు చేయనున్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు బదిలీ చేయనున్నారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ ప్రక్రియ సజావుగా జరిగేందుకు పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్వోలు, రెవెన్యూ యంత్రాంగం ఓటరు జాబితాను ప్రదర్శించనున్నారు. ఓటరు జాబితాలో పేర్లు లేకపోయినా, అభ్యంతరాలు ఉన్నా వెంటనే అందుకు సంబంధించిన ఫారాలు పూర్తిచేసి బూత్ లెవల్ అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. కొత్తగా ఓటు నమోదుకు ఫారం-6, ఏవైనా అభ్యంతరాలు, చనిపోయిన వారి తొలగింపులకు ఫారం-7, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటు మార్పులు, చేర్పులకు ఫారం-8ను పూరించి ఓటరు నమోదు అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. లేదా ఠఠఠ.ఽఽఽ:జీ వెబ్‌సైట్‌లో ఓటు నమోదుకు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

చిరుత సంచారంతో భయం గుప్పెట్లో ప్రజలు


చిరుతపులి దాడిలో గాయపడిన దూడ

నిమ్మనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి సంచారంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. శుక్రవారం తవళం పంచాయతీ ఎగువపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు తన వ్యవసాయ పొలం వద్ద ఆవులను కట్టేశాడు. కట్టేసిన దూడపై చిరుత పులిదాడి చేసింది. అయితే దూడ చిరుతపులి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. అప్పటికే చిరుత దాడి చేయడంతో వళ్లంతా రక్తం కారుతోంది. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఇటీవల చల్లావారిపల్లి, పారేసువారిపల్లెల్లో ఒక ఆవును, మేకను తిన్న విషయం తెలిసిందే. దీంతో సమీప గ్రామస్తులు భయభ్రాంతులు చెంది కొండ సమీపంలోకి గొర్రెలు, మేకలు, పాడి ఆవులు తోలేందుకు సాహసించడంలేదు. కొద్ది రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నా అటవీ శాఖ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైనా లేదు. చిరుతను బంధించేందుకు కనీస చర్యలు కూడా తీసుకోక పోగా చిరుతను వేటాకూడదని చెబుతుండం గమనార్హం. ఇదిలాగే కొనసాగితే ఎవరో ఒకరు చిరుతకు బలికావల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

190 లీటర్ల నాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు


రవినాయక్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం నారమాకుల తండా నుంచి 190 లీటర్ల నాటుసారా తరలిస్తున్న రవినాయక్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం మాలేపాడు క్రాస్ వద్ద ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నారమాకులతండా వాసి బుక్కే రవినాయక్ బైక్‌లో 190 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో నాటుసారా, బైక్‌ను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు రవినాయక్‌ను అరెస్టు చేశారు. సారా కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చిన నక్కలదిన్నెతండాకు చెందిన బుక్కే పద్మావతి మీద కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అలాగే కురబలకోట మండలం తెట్టుగ్రామం వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జి.అనురాధను అరెస్టు చేసి ఆమె వద్ద 76 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో పట్టుబడిన నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డోర్కాస్, జబీవుల్లా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

26న జానపద నృత్య పోటీలు

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో 26న జిల్లా స్థాయి బాలరంగ్ జానపద నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించడం, విభిన్న సాంస్కృతిక విలువలపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. తప్పెటగుళ్లు, కర్రసాము, చెంచులవేట, థింసా, జాలరి, బంజారా మొదలైన జానపద నృత్య గీతాలు ప్రదర్శించవచ్చన్నారు. నృత్య, గాత్ర, వాయిద్య, నైపుణ్యం గల విద్యార్థులు ఒక సమూహంగా (గరిష్టంగా 15 మంది విద్యార్థులు) పాల్గొనవచ్చన్నారు. జిల్లా జట్లు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని సంప్రదాయ జానపదాలను మాత్రమే ప్రదర్శించాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. జిల్లా నుంచి ఒక ఉత్తమ జట్టును మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఉపాధ్యాయులు పిల్లల ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించి, ప్రధానోపాధ్యాయుడి ద్వారా విద్యార్థుల జాబితాను డైట్ లెక్చరర్ అసదుల్లాబాషా మొబైల్ నెంబర్ 9440084715కు వాట్సాప్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ కోసం రూ.30 కోట్లు మంజూరు చేయండి

మంత్రి సత్యకుమార్‌ను కోరిన మంత్రి మండిపల్లి


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను రవాణా, యువజన, క్రీడా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు విధానం ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, మంత్రి సత్యకుమార్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా క్రిటికల్ అండ్ ట్రామా కేర్ సేవలను రోగులకు ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షణ అవసరం కాబట్టి, ప్రస్తుతం సామర్థ్యం సరిపోదని, అందుకోసం రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.30 కోట్ల మంజూరు చేయాలని మంత్రి కోరిన వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తన తండ్రికి ద్రోహం చేశాడనే కోపంతో ఓ వ్యక్తి పిల్లనిచ్చిన మామనే హత్య చేసి జీవిత ఖైదు శిక్షకు గురయ్యాడు. వివరాల్లోకెళితే.... సోమల మండలం నెల్లిమంద పంచాయతీ గొల్లపల్లె వాసి వెంకటసిద్దులు కుమార్తె సిద్ద రత్నమ్మను కలికిరి మండలం గుట్టపాళెం వాసి రెడ్డెప్ప కుమారుడు సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కాగా అప్పట్లో రెడ్డెప్ప అనారోగ్యానికి గురవగా, తన మామ వెంకటసిద్దులే తన తండ్రికి చేతబడి చేశాడనే అనుమానంతో మామపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2017 ఆగస్టు 7న వెంకటసిద్దులు పొలంలోనే హత్యకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చౌడేపల్లె సీఐ రవీంద్ర కేసు దర్యాప్తులో పలు అంశాలు వెలుగు చూశాయి. పొలం వద్ద వున్న వెంకటసిద్దులును సుధాకర్ కొడవలితో నరికి హత్య చేశాడు. కాగా సుధాకర్, బావమరిది రెడ్డెప్పతో కలసి హత్య చేశామని వీఆర్‌ఓకు వివరించారు. వీఆర్‌ఓ సమాచారంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసు కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధించారు.

వీఆర్‌ఏ శాంతమ్మపై బెదిరింపులు

ఒంటిమిట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓబులేశుకోనలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న వీఆర్‌ఏ శాంతమ్మను పరుషపదజాలంతో దూషించారని బాధితురాలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో పెన్నపేరూరు వీఆర్‌ఏ శాంతమ్మ, గంగపేరూరు వీఆర్‌ఏ రమణ ఆక్రమిత సర్వేనంబరు 661లో ప్రభుత్వ భూమిని ఆక్రమించ వద్దని నిబంధనల ప్రకారం రికార్డులు తహసీల్దారుకు చూపించాలని గురువారం రాత్రి ఇంటి వద్దనున్న సుధాకర్‌కు తెలిపారు. వెంటనే సుధాకర్, వారి కుటుంబ సభ్యులు వీఆర్‌ఏ శాంతమ్మపై తమ పనులను అడ్డుకుంటావా నీశక్తి ఎంత, నీకులం ఏది అని పరుషపదజాలంతో పెద్ద ఎత్తున దూషించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. దీనిపై వీఆర్వో ఆంజనేయులు క్షేత్రస్థాయిలో విచారించి తహసీల్దారుకు నివేదిక అందించారు. దీనిపై తహసీల్దారు రమణమ్మను వివరణ కోరగా తమ వీఆర్‌ఏని ఇబ్రహీంపేట వాసి సుధాకర్ దూషించారని అతనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడమేగాక సిబ్బందిని దూషించడం తప్పన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఓ యువతి విషంతాగి ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, బుగ్గకాల్వ చెందిన యువతి తండ్రి కొద్దికాలం కిందట చనిపోయాడు. తల్లి తనను వదిలేసి దూరంగా ఉంటోంది. దీంతో మనస్తాపానికి గురైన యువతి విషం తాగి అపస్మారస్థితిలో పడిఉండడానికి గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ అన్సర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నాతీరం... మునెయ్య నిలయం

- మహిమాన్వితుడు మునెయ్యస్వామి ● 25న తిరుణాళ్ల
- రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక


స్వామి వారికి పూలతో అలంకరించిన పట్టుమెత్త

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుమారు 12 ఏళ్ల ప్రాయంలోనే యాగంటి నుంచి ప్రొద్దుటూరు రామేశ్వరానికి వచ్చిన దొంగకోళ్ల మునిస్వామిగా వ్యవహరించే మునెయ్య స్వామి తిరుణాళ్ల సోమవారం వేడుకగా నిర్వహించనున్నారు. అవదూతగా, సిద్ధపురుషుడిగా పేరుపొందిన మునెయ్యస్వామి కార్తీక మాసం చివరి సోమవారం సజీవ సమాధి అయిన రోజు కావడంతో ఆరోజున ప్రత్యేకించి తిరుణాళ్ల నిర్వహిస్తుంటారు. మునెయ్యస్వామి భక్తులపాలిట కొంగు బంగారంగా పేరుపొందారు. స్వామి మహిమల గురించి తెలియడంతో దేశ వ్యాప్తంగా భక్తులు ఉన్నారు. రామేశ్వరంలోని పెన్నాతీరంలో వెలసిన మునెయ్యస్వామి ఆలయంలో 25వ తేదీ కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తిరుణాళ్ల జరుగనుంది. మునెయ్య మునిస్వామి మహిమలు, మహత్యం గురించి విస్తృత ప్రచారంలో ఉన్నాయి. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో 400 ఏళ్ల కిందట మునెయ్యస్వామి సజీవ సమాధి అయ్యారని చరిత్ర చెబుతోంది.

● మునెయ్యస్వామి చరిత్ర

స్వామి 12 ఏళ్లలోనే యాగంటిలో ఉండగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దర్శనం అవడం, ఆమె ఆదేశానుసారం రామేశ్వరానికి వచ్చినట్లు పేర్కొంటారు. ఇక్కడికి వచ్చిన ఆయన పాతకోట బయపురెడ్డి ఇంటికి వచ్చి వెళ్లేవారు. కురచగా ఉంగరాల జుట్టుతో గోచి మాత్రమే ధరించి బాలుడి రూపంలో పిల్లలతో కలిసి ఆడిపాడి అలసిపోయి రాజరాజేశ్వరి దేవి ఆలయంలో విశ్రాంతి తీసుకునేవారు. పెన్నాతీరం బాలుడి ఆటస్థలంగా మారడంతో తోటి పిల్లలతో గోలీలు, బొంగరాలు ఆడుతూ వారి బొంగరాలు పగులకొట్టేవాడు. ఇసుక తీసుకుని పిల్లల చేతిలో పోస్తే అది చక్కరగా మారేదని, అందుకే పిల్లలు ఎప్పుడూ ఆయన వెంట తిరిగేవారన్నారు. అయితే అప్పట్లో పెన్నాతీరం అడవిని పోలి ఉండడంతో ఆ అడవిలో తిరిగే పులులు, పాములతో సరదాగా ఆడుకునేవాడు. ఆకలైతే కోళ్లను దొంగిలించి తీసుకెళ్లి తింటుండడంతో ఆయనను దొంగకోళ్ల మునిస్వామిగా పిలిచేవారు. మౌనవ్రతం చేపట్టి ఎవరితో మాట్లాకుండా ఉండడంతో ఆయనను మౌనిస్వామిగా పిలుస్తుండగా కాలక్రమంలో మునెయ్యస్వామిగా పిలుస్తున్నారు. మునెయ్యస్వామి అనుగ్రహంతో పుట్టిన పిల్లలకు మునెయ్య, మునెమ్మ, మునిరాజు పేర్లు పెట్టుకుని స్వామివారిని తమ ఇంటి దేవుడిగా భక్తులు కొలుస్తున్నారు. మునెయ్యస్వామి ఉన్నట్లుండి గాలిలో చూస్తూ అదిలించేవారు. ఏమైందని అడిగితే అడవిలో గోవులపై పులి దాడి చేయబోతే తరిమేశానని చెప్పేవాడు. రైతులు వర్షం కురవడంలేదని అడిగితే ఆ రోజు రాత్రే వర్షం కురిసేదంటారు. బయపురెడ్డి ఇంటికి వస్తుండడంతో ఆ ఇంటివారికి తన మహిమలు చూపి ఆ ఇంటి ఇలవేల్పుగా మారారు. స్వామి తన 40వ ఏట కార్తీక మాసం చివరి సోమవారం పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో సజీవ సమాధి అయ్యారు. సమాధి అయ్యే ముందు ఆయన వెలిగించిన దీపం ఇప్పటికీ వెలుగుతూ భక్తులకు దర్శనమిస్తోంది. నాటి నుంచి కార్తీక మాసం చివరి సోమవారం మునెయ్యస్వామి తిరుణాళ్లను నిర్వహిస్తున్నారు. తిరుణాళ్ల సందర్భంగా భక్తులు కోళ్లు, మేకలను బలి ఇస్తారు. కొందరు భక్తులు తలనీలాలు, పుట్టు వెంట్రుకలు స్వామివారికి ఇస్తారు. ఆలయం గోపురంపైన చెక్కిన శిల్పాలు భక్తులను ఆకట్టుకుంటాయి. ఆలయం గోపురంపై గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ వంటి దేశ నాయకుల విగ్రహాలు దేశభక్తిని పెంపొందిస్తాయి. ఆలయం లోపల గోపికల వస్త్రాలను అపహరించే శ్రీకృష్ణుడి విగ్రహం, నంది విగ్రహం, ఆదిశేషునిపై విష్ణుమూర్తి, భూమిలో కుంగిన రథ చక్రాన్ని పైకి ఎత్తుతున్న కర్ణుడు వంటి శిల్పాలు ఆకట్టుకుంటాయి.

మహిళలే పూజారులు

పాతకోట మునెమ్మ వైవాహిక జీవితాన్ని త్యజించి ఆలయంలో మునెయ్యస్వామిని సుమారు వందేళ్లకు పై వయసులో కూడా పూజలు చేసేది. పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో ఆలయం నిర్మించడం, వారి ఇలవేల్పుగా నిలవడంతో పాలకోట వంశీకులే ఇప్పటికీ పూజారులుగా వ్యవహరిస్తున్నారు. మొదటి తరంలో మునెమ్మ అనే భక్తురాలు స్వామివారిని సేవించేది. ఆలయ అభివృద్ధికి కృషిచేసేవారు. అప్పటి నుంచీ నేటి వరకూ మహిళలే ఆలయంలో పూజలు నిర్వహిస్తుంటారు. సుమారు 360 ఏళ్లగా స్వామి వారి సేవ చేయడం తమ అదృష్టమని నేటి పూజారులు వివరిస్తుంటారు. కాగా స్వామి వారి సజీవ సమాధి పక్కనే ఒక పట్టె మంచం వేసి రాత్రికి పూలతో అలంకరించేవారు. తెల్లవారి చూస్తే ఒకరు పడుకుని నిద్రపోయిన విధంగా పూలు నలిగి ఉంటాయి. ఇప్పటికీ ఇలాగే జరుగు తుండడం ఆయన మహిమలకు తార్కాణమని భక్తుల విశ్వాసం. ఇంతటి మహిమాన్వితుడు అప్పట్లో వాడిన వస్తువులు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటకల నుంచి భక్తులు తిరుణాళ్ల సందర్భంలో స్వామివారి దర్శనానికి వస్తుంటారు.




ఆలయం ముందు భాగం - మునెయ్యస్వామి మూలవిరాట్టు - గోపికల వస్త్రాలను అపహరిస్తున్న శ్రీకృష్ణుడు ప్రతిమ

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అన్నిశాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సుండుపల్లె, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు పనిచేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోకూడదన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు, చుక్కల భూములు, మ్యుటేషన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అపార్ ఐడీ, బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింకేజీలను పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ హౌసింగ్, సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 2,352 గృహాలు మంజూరయ్యాయని, 1096 మాత్రమే పూర్తి చేశారని, 573 పనులు ప్రారంభించకపోవడంతో వాటిని లబ్దిదారుల జాబితా నుంచి తొలగించామన్నారు. ఇంకా 683 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేయకపోతే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు.

మండల తీర్మానం ఇవ్వరా....

పల్లె పండుగలో భాగంగా నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం ఇవ్వరా అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన రోడ్లు లేని ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించిందన్నారు. సత్వరం పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం, పనుల నివేదికను అందించాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు.

వినతుల వెల్లువ

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉందని, రాష్ట్ర మంతా పల్లెపండుగలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే సుండుపల్లె మండలంలో మాత్రం పనులు ప్రారంభం కాలేదని టీడీపీ, బీజేపీ నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రోళ్లమడుగు నీటి పథకం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, ఝరికోన ప్రాజెక్టు నుంచి రైతుల కోసం సాగు నీటి కాల్వలు ఏర్పాటు చేయాలని, కమ్మ గుట్టపల్లె గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, తహసీల్దార్ దైవాధీనం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఓ మాలిక్‌బాషా, ఏపీఎం శ్రీనివాసులు, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, సచివాలయ ఉద్యోగులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'భూమిని కాజేసే వారిపై చర్యలు తీసుకోండి'

గాలివీడు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని యత్నిస్తున్న జిలానీ బాషా, తదితరులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలతకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... మండల కేంద్రంలోని సర్వే నెంబరు 477, 475లలో హసనాపురం ఖాదర్ వలి మిఠాయిగిరి నన్నేసాబ్, హసనాపురం ఖైరున్‌బీ, హసనాపురం జవుల్లా, షేక్. అఖిలభాను, షేక్. నసీబ్ జాన్, షేక్.అమీద, షేక్.శంషాద్ అనుభవదారుల పూర్వీకులకు ప్రభుత్వం భూమి ఇచ్చింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే సంబంధం లేని ఇదే గ్రామస్తుడు జిలానీబాషా తప్పుడు డాక్యు మెంట్లు సృష్టించి దౌర్జన్యాలు చేస్తూ మమ్ములను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 80ఏళ్లగా సర్వే నెంబర్లు 477, 475లలో సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయన్నారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు మేము సాగు చేసుకుంటున్న భూమిలో వారెవరికీ హక్కులు లేవని ఫిర్యాదు కూడా చేశామన్నారు. నాడు రెవెన్యూ అధికారులపై సర్వే నెంబర్లలో వారికి ఆ భూమే లేదని లేఖ రూపంలో పంపారు. తప్పుడు ఎంజాయ్‌మెంట్ పొంది మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. రికార్డులను పరిశీలించి భూకబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని వారి నుంచి మాకు ప్రాణ రక్షణ కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, బాధితులు ఉన్నారు.


కలిచెర్ల సమీపంలో సీతాఫలం తోట



సీతాఫలం - సాగులో సఫలం

మండలంలో మొదటి సారిగా సాగు
ఆదాయం మెండు

పెద్దమండ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతాఫలం సీజన్ వస్తే అందరూ అడవుల్లో పండే ప్రకృతి సీతాఫలాలను తెచ్చుకుని లేదా కొనుగోలు చేసి తింటారు. అయితే ఈసీజన్ గ్రామీణ పేదలకు జీవనోపాధి. ఈసీజన్‌లో అడవులకు వెళ్లి సీతాఫలం తెచ్చికుని మాగబెట్టి అమ్ముకుంటుంటారు. దీంతో ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకుంటారు. మండల రైతు అబ్దుల్లా సీతాఫలం సాగు చేస్తూ లాభాల్లో పురోగతి సాధిస్తున్నాడు. వివరాల్లోకెళితే... పెద్దమండ్యం వ ం ండ లం కలిచెర్లకు చెందిన అబ్దుల్లా తన


తోటలో కాసిన సీతాఫలం

ఆరెకరాల్లో సీతాఫలం తోట సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఈ సీతాఫలం మన ప్రాంతంలో తోటలు సాగు చేయడం విశేషం. దీంతో సీతా ఫలం సాగుపై మండల రైతుల దృష్టి మళ్లింది. నస్యర క్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ తెచ్చే పంట సీతాఫలం తోటల సాగుపై రైతు పలు అంశాలు వెల్లడించారు. మూడేళ్ల కిందట సీతాఫలం మొక్కలను మహరాష్ట్రలోని షోలాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నారు. ఎన్‌ఎంకే గోల్డన్ వెరైటీ సీతాఫలం ఎకరాకు 450 మొక్కలు, సాగుకు రూ. 2లక్షల నుంచి రూ. 2. 5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేస్తే రెండేళ్లలోనే దిగుబడులు వస్తాయి. సీతాఫలం చెట్లు కాలపరిమితి 25 నుంచి 30 ఏళ్లు. తోటలు సాగు వ్యవసాయ సాగు పద్దతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగుతో నీటి ఆదా జరుగుతుందన్నారు. ఏటా నిఖర ఆదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చు. ఈ ఫలం తినడం వల్ల కంటికి మంచింది. రక్తహీనత నివారిస్తుంది. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెపుతున్నారు. సీతాఫలం నాణ్యత బట్టి మార్కెట్‌లో కిలో ధర రూ. 100 నుంచి రూ 120 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. సీతాఫలం తోటలు సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు తెలిపారు.

మహానగరాల్లో మంచి డిమాండ్

హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల్లో మన సీతాఫలానికి మంచి డిమాండ్ ఉంది. మార్కెటింగ్ చేసుకోవడానికి అవగాహన అవసరం. సీతాఫలం తోటలు సాగు చేసుకుంటే లాభ దాయక పంట. ఏటా నిఖర ఆదాయం వస్తుంది.

షేక్ అబ్దుల్లా, కలిచెర్ల రైతు, పెద్దమండ్యం మండలం

ఎగుమతులకు సిద్ధంగా...



సబ్సిడీలు పొందాలంటే.. ఎన్‌పీసీఐ తప్పనిసరి

- లేదంటే సబ్సిడీలు రావంటూ అధికారుల హెచ్చరికలు
- పోస్టాఫీసుల్లో నమోదు చేస్తున్న ఉద్యోగులు



పోస్టాఫీస్ వద్ద ఎన్‌పీసీఐ నమోదు చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల నుంచి సంక్షేమ ఫలాల సబ్సిడీ మొత్తాన్ని పొందాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు. లేదంటే సబ్సి డీలు రాకపోవచ్చని హెచ్చరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే అన్ని రకాల సబ్సిడీలు పొందాలంటే తప్పనిసరిగా లింకు చేయించుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. ఆధార్, పాన్ కార్డులు బ్యాంకుకు లేదా ఎన్‌పీసీఐకి తప్పనిసరిగా లింక్ కావా ల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పోస్టల్ ఉద్యో గులు లింక్ చేసేందుకు అర్హుల నుంచి తంబింగ్ ప్రాసెస్ భారీగా చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన దీపం-2 పథకానికి ఇప్పటి వరకు చాలా మందికి సబ్సిడీ పడక పోవడంతో లబ్ధిదారులు ఈ లింక్ చేయించుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీనికి తోడు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయ బోయే మాతృవందనం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఈ లింకింగ్ కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే అధికారులు పబ్లిసిటీ ఇవ్వ కపోవడంతో చాలా మందికి తెలియడం లేదు. ఈ లింకింగ్ కోసం రూ.200 రుసుం చెల్లించాల్సి వుంటుంది.



సబ్సిడీలు ఖాతాల్లో జమకావాలంటే...

పీఎం కిసాన్, అన్ని రకాల పెన్షన్లు, స్కాలర్‌షిప్, ఎల్‌పీజీ గ్యాస్, ఎరువుల సబ్సిడీ, మాతృవందనం, ఎంఎన్ఆర్‌ఈజీపీ ఇలా అన్ని రకాల సబ్సిడీలు వారి ఖాతాల్లో జమకావాలంటే తప్పనిసరిగా లింక్ చేసుకోవాల్సిందేనని అధికారులు అంటున్నారు. ఇందు కోసం స్థానిక పోస్టాఫీసు వద్ద తుమ్మలపల్లె, వలసపల్లె, జువారి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్ వచ్చిన వారికి లింకింగ్ ప్రాసెస్ చేస్తున్నారు.

భవిష్యత్తులో అన్ని పోస్టాఫీసుకే..

రానున్న రోజుల్లో అన్ని రకాల సేవలు పోస్టాఫీసు నుంచే చేయనున్నట్లు తెలుస్తోంది. ఇకపై గ్రామాల నుంచి డబ్బు కోసం బ్యాంకులకు రాకుండా ప్రతి పల్లెలో పోస్టు బ్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అందరికీ అందుబాటులో ఉండేలా, సులభ తరంగా నేరుగా డబ్బు తీసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తన అధీనంలో ఉన్న పోస్టాఫీసులను వినియోగిస్తున్నట్లు భావిస్తున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే అన్ని రకాల సబ్సిడీలు కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండే విధంగా ఈకార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసే ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎన్‌పీసీఐకి లింక్ తప్పనిసరి చేస్తున్నారు.

సచివాలయ సిబ్బందిని పోస్టల్ వారితో లింక్‌చేశాం

ఎన్‌పీసీఐకి లింక్‌కాని వారి లిస్టు కలెక్టర్ కార్యాలయం నుంచి మాకు వచ్చింది. సుమారు మూడువేలకు పైబడి మంది బ్యాంకుకు, లేదా పోస్టల్ అకౌంట్‌కు లింక్ కాని వారు ఉన్నారు. వారందరి ఆధా ర్, పాన్ కార్డులను ఎన్‌పీసీఐకి లింక్ చేసేందుకు చర్యలు తీసు కుంటున్నారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బందిని పోస్టా ఫీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆధార్ అకౌంట్‌కు లింక్ అయినవారికి అవసరం లేదు.

-శేషఫణి, కమిషనర్, ఎర్రగుంట్ల

జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు కడప విద్యార్థిని శ్రీలతారెడ్డి



శ్రీలతారెడ్డిని అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం షర్మిలారాణి

కడప స్పోర్ట్స్, నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.శ్రీలతారెడ్డి 68వ జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు పోటీలకు ఎంపికైంది. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలతారెడ్డి పలు క్రీడా పోటీలలో పాల్గొంటూ పలు పతకాలు సాధిం చింది. ఆ మేరకు ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఈ నెల 26 నుంచి 30 వరకు లక్నోలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. శుక్రవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి, పాఠశాల పీఈటీ మంజులత, ఉపాధ్యాయులు శ్రీలతారెడ్డిని అభినంచారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు నీలకంట్రావుపేట విద్యార్థులు ఎంపిక



రామాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించే త్రోబాల్ పోటీలకు నీలకంట్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో నీలకంట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థులు అండర్-14 విభాగంలో జి.నాగచైతన్య, కె.పవనేశ్, బాబు, స్టాండ్‌బైగా వెంక టరామయ్య, అండర్-17 విభాగంలో హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పీడీ నరేంద్రకుమార్‌రెడ్డిని అభినందించారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ



ఎంఓయూ ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాలల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగం, కేరళలోని క్రైస్ట్ కళాశాల జియాలజీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వీసీ క్రిష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, ఎర్త్‌సైన్స్ హెచ్‌ఓడీ తుమ్మలకుంట శివ, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ప్రొఫెసర్ లింటో, డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా, పరిశోధనాపరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు.

రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మల్లికార్జున

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కమలాపురం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వ్యవసాయాధికారులకు మరియు వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అగ్రిల్యాబ్‌లో ఉన్న సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి రైతు విత్తనాలు, ఎరువులు పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. పరీక్షల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంటలకు ఎలా ఉపయోగించాలనే విషయాలను తెలుసుకోవచ్చన్నారు. డీడీఏ మల్లికార్జున అగ్రిల్యాబ్‌లోని వివిధ రకాల పరికరాలను వాడే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, ముదనూరు, కమలాపురం, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె అగ్రిల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

'బీసీ కుల జనగణన చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

కడప మారుతీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు సంబంధించి కుల జనగణన చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ పూర్ణ చంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ, కో-కన్వీనర్ రెడ్డిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నాటి బ్రిటీష్ ప్రభుత్వం గత 1931లో బీసీ కుల జనగణన చేపట్టిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా బీసీ వర్గాల కుల జనగణన చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఎన్నికలప్పుడు నా బీసీలు అనే పలు పార్టీల నాయకులు అధికారంలోకి రాగానే బీసీల గురించి మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల పశువులతో పాటు కుక్కలు, కోళ్ల గణన చేసిన పాలకులకు బీసీ కుల గణన చేయకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ బీసీల కుల జనగణన చేపడుతున్న సంగతి తెలిసిందేనన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా చేపట్టాలన్నారు. చట్ట సభల్లో బీసీ వర్గాలకు జనాభా దామాష ప్రకారం అందాల్సిన రాజకీయ రిజర్వేషన్‌లు అందలేదన్నారు. బీసీ వర్గాల పిల్లలకు సరైన రీతిలో విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కాలంటే బీసీల జనాభా ఎంత శాతం ఉందనే విషయం బహిర్గతం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వర్గాల ప్రజలు జాగృతమై పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం బీసీ జిల్లా సమన్వయ కమిటీ నూతన ఎన్నిక నిర్వహించారు. జిల్లా చైర్మన్‌గా శివరామాచారి, కన్వీనర్‌గా కృష్ణకిరీటి, ప్రధాన కార్యదర్శిగా మణికుమార్, కో-కన్వీనర్లుగా వివేకానంద, చిన్న ఎన్నికయ్యారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి : కలెక్టర్



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కలసపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని తెల్లపాడు పంచాయతీలలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన ఉద్యానవన పంటలను, చెరువులను, లిఫ్ట్‌ఇరిగేషన్, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఉద్యానవన పంటలు సాగుచేస్తే దిగుబడులు ఎలా వస్తాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్వాక్రా మహిళలు ఎవరైన లోన్లు తీసుకని అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా సరైన సమయంలో పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తెల్లపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అదనపు గదులు, అటెండరు మంజూరు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో పరిశీలించిన విషయాలపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

నెల్లూరు (లీగల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన పప్పర్తి సుబ్బారాయుడు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2020 మే 19వ తేదీ రాత్రి అత్మకూరు సమీపంలో బాలిక, ఆమె మావయ్య సుబ్బారాయుడు లారీ ఎక్కారు. సంగం వద్ద టిఫిన్ సాకుతో బాలిక మావయ్యను లారీ నుంచి దించిన నిందితుడు ఆ తర్వాత బాలికను తీసుకుని లారీలో కృష్ణపట్నం వైపు వేగంగా వెళ్లాడు. ఆ తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో సంగం పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్లు...

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితుడు యాతగిరి వీరభాస్కర్‌కు తిరుపతి రెడ్‌శాండిల్ స్పెషల్‌ఫోర్స్ జడ్జి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఎఫ్ఆర్‌ఓ నయీం ఆలీ వివరాల మేరకు... 2018వ సంవత్సరంలో లోతువంక బీట్ పరిధిలో అటవీ అధికారులు దాడులు నిర్వహించి.. అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న వీరభాస్కర్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 126 కేజీల బరువు గల 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతను సిద్దివటం మండలం వెంకటాయపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ కేసుకు సంబంధించి తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్‌కోర్టు జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానాను విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానాను చెల్లించని పక్షంలో మరో 6నెలల జైలు శిక్షను అదనంగా విధించినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు.

వార్డెన్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన విద్యార్థి సంఘం నాయకుడి అరెస్టు

ముద్దనూరు నవంబరు22 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ కేసులో రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) నాయకుడు తోల్ల జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

ముద్దనూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డన్ మనోహర్‌ను విద్యార్థి సంఘం నాయకుడు జగన్ డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఉద్యోగం పోయేలా చేస్తామని బెదిరించి, మానసిక వేధింపులకు గురిచేశాడు. వార్డన్ ఫిర్యాదు మేరకు జగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెండ్లిమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లె వద్ద గల పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది పోలీసులతో కలిసి దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. పక్కనే ప్రభుత్వ ఇసుక క్వారీ ఉండడం, ఆ ఇసుక క్వారీ పక్కనే అనధికారకంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చక్రాయపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లెలో గత నెల అక్టోబరు 26వ తేదీ జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మాలపల్లెలో యల్లమ్మ అనే మహిళ ఇంట్లో రూ.4.90 లక్షల విలువైన 160 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, రూ.7500నగదు దొంగతనం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మైదుకూరు మండలం అన్నలూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. ముద్దాయి అత్తారిల్లు అయిన చిలేకాంపల్లె మాలపల్లె గ్రామానికి వచ్చి తన అత్త చెల్లెలు అయిన యల్లమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం చేసినట్లు పంచాయతీదారుల సమక్షంలో ఒప్పుకొని సొత్తు, నగదు చూపడం జరిగిందన్నారు. నిందితుని అరెస్టు చేసి సొత్తును రికవరీచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

దుర్వాసన వస్తున్న కేక్ అమ్మకం

- కొనుగోలుదారుడి ఫిర్యాదు
- రూ.5 వేలు జరిమానా

బద్వేలుటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగురోడ్ల కూడలిలో ఓ బేకరిలో దుర్వాసన వెదజల్లే కేక్‌లను విక్రయిస్తున్నారని ఓ వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ వ్యక్తి మధ్యాహ్నం బేకరికి వెళ్లి కేక్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లాడు. తినేందుకు బాక్స్ ఓపెన్ చేయగా దుర్వాసన రావడంతో వెంటనే బేకరివద్దకు వచ్చి వారిని ప్రశ్నించారు. ఎప్పుడో తయారు చేసిన కేకులను ఎందుకు విక్రయిస్తున్నారని వాగ్వాదానికి దిగాడు. ఆ వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు బేకరిని తనిఖీచేసి కేక్‌ను పరిశీలించగా దుర్వాసన వస్తుండటంతో రూ.5వేలు జరిమానా విధించారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు మెమోలు జారీ

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం గురుకుల పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా పాఠశాలలో జరుగుతున్న పరిణామాలకు సంబంధించి పత్రికలో వస్తున్న కథనాలకు సంబంధించి కారణమైన ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవసరమైన రైతులకు బిందు, తుంపర పరికరాలు ఇవ్వాలి



బిందుసేద్యంపై రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా అధికారి లక్ష్మీదేవి

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమైన ప్రతి రైతుకు అందించాని .జిల్లా సూక్ష్మ నీటిసాగు అధికారి వై.లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం బిందు, తుంపర సేద్యం పరిక రాలు, ప్రాథమిక సర్వేలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆకేపాడులో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు సూక్ష్మ నీటి సేద్య పరికరాలను 30,950 హెక్టార్లకు సరఫరా చేయాల్సి ఉండగా 28,950 హెక్టార్లకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు 5445 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఐదెకరాల్లో లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్నవారికి 70 శాతం రాయితీతో బిందుసేద్య పరికరాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ ఉద్యాన వ్యవసాయ, పట్టుప రిశ్రమ సహాయకులు, ఎంపీఈవోలు బిందు, సేద్య పరికరాలు కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను వెంటనే సందర్శించి ప్రాథ మిక సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు, ఎంఐడీసీ చంద్ర, ఎంఐ ఇంజనీర్ గురుప్రసాద్, ఎంఏవో నజీర్, రాజంపేట, నందలూరు, పెనగలూరు రైతుసేవా కేంద్రాల సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్


చిన్నమాచుపల్లె పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చెన్నూరు, నవంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలో త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సరస్వతి శుక్రవారం పరిశీలించారు. ఆమె మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. చెన్నూరు, చిన్నమాచుపల్లె పోలింగ్ కేంద్రాలలో గతంలో ఉన్న పరిస్థితిని, ప్రస్తుత పరిస్థితిని క్షుణ్ణంగా గమనించారు. కడప డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలోని 5 నీటి సంఘాలకు సంబంధించి చెన్నూరు, చిన్నమాచుపల్లెలో ఎన్నికలు జరుగుతాయన్నారు. మిగిలిన ఆలంఖాన్‌పల్లె, పాతకడప, ఉక్కాయపల్లెకు సంబంధించి ఆయా ప్రాంతాలలో ఓట్లు వేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను తయారుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ సాధిక్‌బాషా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూలో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి


వైవీయూ వీసీకి బ్రోచర్‌ను అందజేస్తున్న గానుగపెంట హనుమంతరావు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ కోరారు. శుక్రవారం యోగి వేమన యూనివర్సిటీలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ క్రిష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ స్పందిస్తూ యూనివర్సిటీ పక్షాన తన సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, మొల్ల సాహితీ పీఠం సభ్యులు షేక్ జియావుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం


● టీడీపీ లీగల్ సెల్ నాయకులు శివశంకర్‌రెడ్డి, గుర్రప్ప

కడప రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):రాయలసీమలోని కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ గడ్డ గుర్రప్ప ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. యువగళంలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపడం సంతోషకరమన్నారు. అలాగే కర్నూలు నుంచి లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ కార్యాలయాల తరలింపు కూడా ఉండదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభించారన్నారు. వాటిని పూర్తి చేసే బాధ్యతను చంద్రబాబునాయుడు చేపడుతున్నారన్నారు. రాయలసీమ అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం గోరంత చర్యలు కూడా తీసుకోకపోగా మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి ఏ ప్రాంతాన్నీ అభివృద్ధి చేయకుండా అన్ని వర్గాల ప్రజలను దగాచేసిందన్నారు. టీడీపీతోనే సీమ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

సికెదిన్నె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊటుకూరులో సీతారామ సమేత లక్ష్మణ హనుమంత్ విగ్రహాల ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మూడవ రోజు విగ్రహ ప్రతిష్ఠను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుర్రాల రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య


కడప-రాయచోటి జాతీయ రహదారిపై చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె వద్ద ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వెలగకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంధకారంలో ప్రయాణం ఆందోళన కలిగిస్తోందని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు విన్నవిస్తున్నారు. -చింతకొమ్మదిన్నె, (ఆంధ్రజ్యోతి)

బెల్లపు ఊటను ధ్వంసం చేసిన అధికారులు

పులివెందుల టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను శుక్రవారం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని కాలువగట్టు వద్ద ఉంచిన దాదాపు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే దీన్ని తయారు చేస్తున్న మల్లికార్జున అనే వ్యక్తి ని అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా నాటు సారా తయారీకి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి, సిబ్బంది వెంకట్రామిరెడ్డి, మల్లికార్జున, రమణయ్య, బాలసుబ్రమణ్యం, నాగేంద్ర పాల్గొన్నారు.

'వెంకటసుబ్బమ్మకు న్యాయం చేయండి'

కడప(వినాయకనగర్), నవంబరు22(ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పోస్టుల నియామకంలో వెంకటసుబ్బమ్మకు న్యాయం చేయాలని శుక్రవారం బిషప్ హౌస్ ఎదుట ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఆర్‌సీఎం పాఠశాలలో గత 15 సంవత్సరాలుగా పని చేస్తున్న బిషప్ ప్రతినిధులు ఆమెకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఆ పోస్టును బిషప్ బంధువులకు వేసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అన్నెం చిన్నసుబ్బయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మాతయ్య, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?


చక్రాయపేట మండలం కొండవాండ్లపల్లె సమీపంలో గుంతలమయమైన రోడ్డు


చక్రాయపేట వద్ద కంకరమయమైన రోడ్డు


మద్దెరేవుల సమీపంలో బ్రిడ్జికి కడ్డీలు వేసి వదిలేసిన దృశ్యం



వంకపై బ్రిడ్జి కోసం తవ్విన గుంత.. కోనంపేట వద్ద బ్రిడ్జీపై కడ్డీలు పరిచి వదిలేసిన దృశ్యం

చక్రాయపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి):అది ఆషామాషా రోడ్డు కాదు.. జాతీయ రహదారి.. రోడ్డంతా గుంతలు.. కంకర.. వాహనదారులకు నరకం కనిపిస్తోంది. వేంపల్లె-రాయచోటి జాతీయ రహదారి దుస్థితి ఇది. మూడేళ్ల క్రితం రవీంద్రారెడ్డి అనే కాంట్రాక్టర్ రూ.283 కోట్లతో పనులు దక్కించుకున్నారు. కొంతమేర పనులు పూర్తి చేశారు. ఆయన మృతిచెందడంతో పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత కాంట్రాక్టర్లు మారుతున్నారు తప్ప పనులు మాత్రం జరగడం లేదు. దీంతో వాహనాలు పక్కదారిన వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు వస్తే ఆ దారిన మోకాటిలోతు నీళ్లు నిలబడతాయి. అయినా ఏ అధికారీ పట్టించుకోవడం లేదు. కనీసం గుంతలు కూడా పూడ్చలేకపోతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని ఈ దారిన బస్సులను కూడా అధికారులు తగ్గించారు. వెంటనే అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



మూడేళ్లవుతున్నా దిక్కులేదు

మూడేళ్లు అవుతున్నా ఈ రోడ్డు పనులు ఒక ఇంచి కూడా కదలడం లేదు. ఇటు వేంపల్లె అటు రాయచోటికి వెళ్లాలంటే వాహనాలు దెబ్బతింటున్నాయి. కాంట్రాక్టర్లు మారుతున్నారు తప్ప పనులు చేపట్టలేకపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచి పనులు పూర్తి చేయాలి. కొండవాండ్లపల్లె వద్ద కిలోమీటర్ దూరం వెళ్లాలంటే అరగంట పడుతోంది.- **సుబ్బారెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లె**

మొక్కు తీర్చుకున్న పుత్తా సతీమణి సరళమ్మ


చౌడేశ్వరీదేవి సన్నిధిలో పుత్తా సరళమ్మ

చెన్నూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా తమ కుమారుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి విజయం సాధించాలని గతంలో మొక్కుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ శుక్రవారం రామనపల్లిలోని చౌడేశ్వరీదేవి సన్నిధిలో ఆ మొక్కు తీర్చుకున్నారు. అమ్మవారికి వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆవుల పవన్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, రైతు విభాగం రాష్ట్ర మాజీ కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నేత హరినాథరెడ్డి పాల్గొన్నారు.

పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి: ఆపస్


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, కొండారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇప్పటికే రకరకాల యాప్‌లు, లీడర్‌షిప్ ట్రైనింగ్‌లు, అపార్ నమోదు తదితర పనులతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. పాఠశాలలో పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, శ్రీనివాసులు, నాయకులు చంద్రమోహన్, సుబ్బనర్సయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అహల్య తెలిపారు. శుక్రవారం ఓటరు నమోదు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక డిగ్రీ కళాశాలలో తహసీల్దార్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతే ఓటు హక్కు వస్తుందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంవత్సరంలో నాలుగు విడతలుగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కొత్తగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.లక్షుమయ్య, అయ్యవారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం


అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కడప కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం 50వ డివిజన్ పరిధిలోని పాలంపల్లెలో శుక్రవారం అయ్యప్పస్వామి 9వ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. సాయంత్రం 6 గంటలకు ఆ గ్రామ నాలుగురోడ్ల కూడలి వద్ద గల రామాలయం నుంచి గ్రామోత్సవం కేరళ వాయిద్యాలు, బెస్తవారిపల్లె వల్లూరు తిరుమలయ్య బృందంచే కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అయ్యప్పస్వాములు మజ్జారి వెంకటరమణ, శ్రీనివాసులు, రామయ్య, వెంకటేష్, కృష్ణయ్య, రమణ, గురుస్వాములు, కన్నెస్వాములు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

పంట సాగులో అధిక లాభాల దిశగా పరిశోధనలు


డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త

ఫటాఫట్

సికెదిన్నె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంట సాగులో అధిక లాభాల దిశగా పరిశోధనలు సాగిస్తున్నట్లు కడప వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూలో ఆ వివరాలు తెలిపారు.

ప్రశ్న: ప్రధానంగా ఏయే పంటల్లో పరిశోధనలు చేస్తుంటారు.

జవాబు: వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరులో ప్రధానంగా వరి, వేరుశనగ, జొన్న, నువ్వులు, మినుము పంటల్లో వివిధ అంశాలపై పరిశోధనలు జరుగుతుంటాయి.

ప్రశ్న: ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఎంతమంది శాస్త్రవేత్తలు పని చేస్తుంటారు.

జవాబు: ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఐదుగురు శాస్త్రవేత్తలు పని చేస్తున్నారు.జీవన ఎరువుల ఉత్పత్తి, భూసార పరీక్షలు నిరంతరం జరుగుతుంటాయి.

ప్రశ్న: పరిశోధనా స్థానానికి కొత్తవంగడాలు, విత్తనాలు ఏమైనా వస్తున్నాయా...?

జవాబు: వరిలో యూటీఆర్ 181 అనే కొత్తరకం రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోంది. వేరుశనగలో కదిరి-6, బీడర్‌సీడ్ విత్తనోత్పత్తి చేస్తున్నాం.

ప్రశ్న: డ్రోన్ వినియోగంపై మీ అభిప్రాయం ఏమిటి?

జవాబు: ప్రస్తుతం డ్రోన్ వినియోగంపై అన్ని రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్నారు. రైతులకు పురుగు మందుల వాడకం, కీటకనాశిని, పైర్లకు అందించే ఎరువులు, తక్కువ సమయంలో సమర్థవంతంగా వినియోగించేందుకు డ్రోన్లు బాగా ఉపయోగపడతాయి. వీటి విస్తరణ పెరగాలి.

ప్రశ్న: కొత్తరకం ప్రయోగ విత్తనాలు ఎంత కాలానికి రైతులకు అందుతాయి.

జవాబు: పరిశోధనలు జరిపి రైతులకు అందించేందుకు 3 నుంచి 10 సంవత్సరాల వరకు పడుతుంది. వివిధ అంశాలపై పరిశోధనలు జరిపి వాటిని పరీక్షించిన అనంతరమే రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. పరిశోధనా స్థానంలో ప్రస్తుతం కీటక యాజమాన్యంపై డ్రోన్ ద్వారా ప్రయోగం చేస్తున్నాం.

ప్రశ్న: పరిశోధనా స్థానంలో ఇంకా ఏయే కార్యక్రమాలు చేస్తుంటారు.

జవాబు: వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధనలతోపాటు సమాంతరంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల నడుస్తోంది. బేసి కార్యక్రమం ద్వారా ఎరువులు, పురుగు మందుల డీలర్లకు ప్రతి నెలా శిక్షణ, సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

ప్రశ్న: రైతులకు మీరు ఎటువంటి సహకారం అందిస్తారు.

జవాబు: వ్యవసాయ శాఖ, ఆత్మాతో కలిసి రైతులకు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని, మెళకువలను అందించి పంట దిగుబడికి కృషి చేస్తాం. వారి సందేహాలను నివృత్తి చేస్తాం

అమ్మవారికి కుంకుమార్చనతో సకల శుభాలు


లలితాంబ ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

చెన్నూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): లలితాంబికా దేవికి కార్తీక మాస శుక్రవారం నాడు చేసే కుంకుమార్చనతో సకల శుభాలు చేకూరుతాయని వేద పండితులు కోడూరు కమలాకరశర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం చెన్నూరు నాగేశ్వరాలయంలో అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ సకల శుభాలు ఇచ్చే మంగళకారిణి, శుభప్రధాత, లలితాంబికా దేవి అని, ఆ అమ్మవారిని నిత్యం మహిళలు ఆరాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఈశ్వర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష అనుభవాల ద్వారా ఉత్తమ ఫలితాలు

లింగాల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష అనుభవాల ద్వారా విద్యార్థులకు బోధన చేయడం ఉత్తమ ఫలితాలను ఇస్తుందని ప్రిన్సిపాల్ సత్యవతమ్మ అన్నారు. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు శుక్రవారం పులివెందులలో ఉన్న సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు పరిశ్రమలలో క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వృత్తి విద్యపై అవగాహన కలిగించడం కోసం ఇండస్ట్రియల్ ట్రిప్‌కు తీసుకెళ్లామన్నారు. సోలార్ ద్వారా విద్యుత్ ఏ విధంగా ఉత్పత్తి అవుతుంది అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ ఒకేషనల్ ట్రైనర్ కవిత, ఐటీ ఒకేషనల్ ట్రైనర్ పార్వతి, పీఈటీ ఉపాధ్యాయురాలు నిఖిలరెడ్డి, ఎలక్ట్రీషియన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సోలార్ సిస్టం గురించి తెలుసుకుంటున్న ఇప్పట్ల గురుకుల కళాశాల విద్యార్థులు

సాంకేతిక శిక్షణా కేంద్రం తరలింపు వద్దు:తులసిరెడ్డి

వేంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూ.250కోట్లతో మంజూరు చేసిన సాంకేతిక శిక్షణా కేంద్రాన్ని కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి చంద్రబాబు ప్రభుత్వం అమరావతికి తరలించేందుకు ఇచ్చిన జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


వేంపల్లెలో అబేట్ పిచికారీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వేంపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. శుక్రవారం పట్టణంలోని రాజారెడ్డి కాలనీలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు, ప్రజలకు మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. నిల్వలున్న నీటిలో అబేట్ పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈఓ బాబా ఫక్రుద్దీన్, ఎంఎల్‌హెచ్‌పి శంకరమ్మ, ఆరోగ్య కార్యకర్త శిరీష, ఆశాకార్యకర్త తులసి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

సికెదిన్నె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మలేరియా అధికారి నాగలక్ష్మిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రొఫెసర్స్ కాలనీలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిలోని తొట్లు, కుండలు, బానలను వారానికి ఒకసారి శుభ్రపరచుకోవాలన్నారు. తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ తదితర జబ్బులు వస్తాయని, కీటకజనిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయని రాత్రిపూట దోమతెరలు వాడాలన్నారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ జ్వరాల గురించి కరపత్రాలు ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం సిసింద్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కడప - C.O.: 99854 04960
పులివెందుల - S.R.: 95812 61647
A.C.M.: 99854 11184

రేపు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుండె ఉచిత వైద్య శిబిరాన్ని వలసపల్లెరోడ్డులోని గౌతం హైస్కూల్‌లో ఆదివారం నిర్వహిస్తున్నట్లు మానవత యూనిట్ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఈ శిబిరానికి ప్రొద్దుటూరు హోక్షిత్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి గుండె వైద్యుడు భూపాల్‌రెడ్డి హాజరై రోగులను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్నిరైళ్లకు తిరిగి స్టాపింగ్ ఇవ్వాలి

డీఆర్‌ఎంను కోరిన ప్రజాసంఘాలు

కొండాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కరోనా రాక ముందు కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు తిరిగి స్టాపింగ్‌ను పునరుద్ధ రించాలని ప్రజాసంఘాల నాయకులు గుంతకల్లు డీఆర్‌ఎం విజయకుమార్‌ను కోరారు. శుక్రవారం కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ప్రజాసంఘాల నాయకులు సుబ్బారావు, నాగసుబ్బ రాయుడు, జోసెఫ్, రామనాథరెడ్డి, సబ్బులు రమణ, బహదూర్, వెంకటరమణ పాల్గొన్నారు.

నీటిలభ్యతను పరిశీలించిన డీఆర్‌ఎం

గుంతకల్లు డీఆర్‌ఎం విజయకుమార్ కొండాపురం రైల్వేస్టేషన్‌లో రైళ్లకు నీటి లభ్యతను పరిశీలించారు. రైళ్లకు నీళ్లు నింపేందుకు ఉన్న వాటర్‌ట్యాంక్‌లను ఆయన పరిశీలించారు.

ఆదమరిచావో..!

- రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లతో భయాందోళనల్లో ప్రజలు
- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదం

బద్వేలుటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రద్దీగా ఉండే జాతీయ ప్రధాన రహదారులను ఆనుకొని పలుచోట్ల విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కంచెలు లేక కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు ఏ ప్రమాదాలకు గురవుతారోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. దీనికి తోడు వర్షాకాలం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో నేల తేమగా మారి విద్యుత్తు సరఫరా అయ్యే అవకాశాలు అనేకచోట్ల కన్పిస్తున్నాయి. వీటి వల్ల ప్రమాదం పొంచిఉన్నా, ట్రాన్స్‌కో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు తలెత్తుతున్నాయి. అవాంఛనీయ సంఘటనలు జరిగితేకానీ పట్టించుకోరా అని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణంలోని మైదుకూరురోడ్డులోని యూనియన్ బ్యాంకు, మైదుకూరురోడ్డులోని మున్సిపాలిటీ పెట్రోలుబంకు, నెల్లూరు రోడ్డులోని ఫాతిమా స్కూలు వద్ద విద్యార్థులు రద్దీగా తిరుగుతుంటారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో పలుప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక మార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు.



ఫాతిమా స్కూలు వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మరు



జాతీయరహదారిలోని మున్సిపాలిటీ పెట్రోలు బంకు వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మరు



జాతీయ రహదారిలోని యూనియన్ బ్యాంకు వద్ద...

రేపు జ్యోతిక్షేత్రంలో టెంకాయలు,తలనీలాల వేలం

కాశినాయన,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జ్యోతిక్షేత్రంలో టెంకాయలు, తలనీలాల వేలం ఈనెల 24వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు వేలంపాటలు పూర్తవుతాయన్నారు.ఈవేలంపాటల్లో పాల్గొనదలచిన వారు టెంకాయలకు లక్ష, తలనీలాలకు లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలంపాటలు ముగిసిన వెంటనే పాట దక్కించుకున్నవారు మూడింట ఒక వంతు డబ్బును వెంటనే చెల్లించాలన్నారు. మిగిలిన డబ్బును ఆరాధన ముగిసిన తర్వాత చెల్లించాల్సి ఉంటుందన్నారు.వేలంపాటలపై సర్వహక్కులు నిర్వాహకులకే ఉంటాయన్నారు.

28న తలనీలాలకు...

చాపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లాడుపల్లెలోని వీర భద్రస్వామి దేవస్థానంలో తలనీలాలకోసం ఈనెల 28న గురువారం ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆ దేవస్థానం ఈవో మారుతీప్రసాద్ తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఏడాదిపాటు సేకరించుకోవచ్చన్నారు. ఇందుకు ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించాలని ఆయన కోరారు. అదే రోజున 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే నిలువ ఉన్న వెంట్రుకల కోసం కూడా వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. దీనికి వేలం పాటలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు.

'బీజేపీ పాలనలో కార్మికులు, రైతులకు అన్యాయం'

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలనలో కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ విధానాలకు రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం, వైసీపీ మద్దతు తెలపడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26వ తేదీ కడప కళాక్షేత్రం వద్ద భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సాల్మన్, రాఘవ, శేఖర్, శ్రీను, లక్షుమయ్య పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ కార్మిక, కర్షక విధానాలను వ్యతిరేకించండి

బద్వేలు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అను సరిస్తున్న కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధా నాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కేంద్రప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ నెల 26వ తేదీన నిర్వహించే ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షకులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు,డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: కేంద్రప్రభుత్వ విధానాలపై శంఖారావం పూరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక, కర్షక, కాంట్రాక్ట్ ఉద్యోగులు ప్రజాసంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 26న నిర్వహించే సభలు,సమావేశాలు, ర్యాలీలు,ధర్నాలను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

క్రీడా పోటీల్లో బాలికల ప్రతిభ

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం జోనల్ క్రీడా పోటీల్లో వెల్లాల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పరుగుపందెం, హైజంప్‌లో మొదటి స్థానంలో నిలిచిన పదో తరగతి విద్యార్థిని 400,500,800,1500 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. జూనియర్ విభాగంలో ఏడో తరగతి నాగవేణి హైజంప్‌లో ప్రథమస్థానం నిలిచింది. విద్యార్థినులను ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉపాధ్యాయ బృందం ప్రశంసించారు.

బహిరంగ ప్రకటన

కడప జిల్లా మైలవరం మండలం ఎం.కంబాలదిన్నె గ్రామములో ఉండే శ్రీ మారెమ్మ దేవస్థానము నందు సేవ టికెట్స్ నూతనముగా ప్రవేశ పెట్టుటకు గాను ఏమైనా అభ్యంతరములు ఉంటే లిఖిత పూర్వకముగా వ్రాసి 10 దినముల లోపల ఇవ్వవలెనని సదరు దేవస్థానము కార్యనిర్వహణాధికారి ప్రకటన ద్వారా వెల్లడి చేయించినారు.

నూతనముగా ప్రవేశ పెట్టబోవు సేవల వివరములు

వ.సం. నూతనముగా ప్రవేశ పెట్టు సేవల వివరములు:-**1) కుంకుమార్చన** :విలువ: 30.00, **2) పంచామృతాభిషేకము:** విలువ రూ.100.00, **3) పల్లకిసేవ (శుక్రవారము)** : విలువ రూ.100.00, **4) గండదీపము:** విలువ రూ. 100.00, **5) చిన్న తీర్థము:** విలువ రూ.20.00, **6) పెద్దతీర్థము** :విలువ రూ.300.00,**7) వాహన పూజలు:** విలువ రూ.50.00, **8) తలనీలాలు:** విలువ రూ.40.00

తేది:22.11.2024
ఎం.కంబాలదిన్నె

K.SREENIVASULU, Grade-1
Executive Officer
Cell: 99897 93906

బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న శశిభూషణ్‌రెడ్డి

ముద్దనూరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, కొండాపురం బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ముద్దనూరులో బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపీటీసీలు లక్ష్మీకాంతమ్మ, వెంకటసుబ్బయ్య, బీజేపీ నాయకులు మధుసూదనరెడ్డి, కాటమయ్య, సురేంద్రనాథరెడ్డి,శివశంకర్‌రెడ్డి,గోపాలక్రిష్ణయ్య, మురళీ, వినోద్, సుబ్బరాయుడు, నాగరాజు, ఓబులేసు,తులశయ్య, బడుగురాజు,సాగర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ



బద్వేలు, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి) : బద్వేలు పట్టణంలోని ఎస్సీ-2 వసతిగృహ విద్యార్థులకు శుక్రవారం బొమ్మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం ఫౌండేషన్ నిర్వాహకుడు, బీజేపీ పార్లమెంటు కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు హాస్టల్‌ను పరిశీలించిన సమయంలో విద్యార్థులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ప్రస్తుత చలికాలంలో విద్యార్థులు చలి తీవ్రతను ఎదుర్కొంటుండడంతో వారి కోసం దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో ఆవుల శేఖర్ రాయల్, అమ్మ డ్రైవింగ్ స్కూల్ కాలువ నాగరాజు, గోపిశెట్టి శ్రీనివాసులు,హాస్టల్‌వార్డన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్, ఓటు బదిలీ చేయండి

ముద్దనూరు, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు మండలంలో పునరావాసం కల్పించారని ఇప్పటి వరకు తమ ఓటు కొండాపురం మండలంలో ఉందని, తమకు ముద్దనూరు మండలంలో ఓటు కల్పించాలని కొత్త చౌటిపల్లె వాసులు శుక్రవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కొండాపురం మండలంలోని చౌటిపల్లె గ్రామం గండికోట ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో మునిగి దాదాపు 10 సంవత్సరాలు కావస్తోందన్నారు. అప్పటి నుంచి ముద్దనూరు మండలంలో కేటాయించిన కొత్త చౌటిపల్లెలో నివాసం ఉంటున్నామన్నారు. ఇప్పటి వరకు తమకు ఇంటి నంబరు కేటాయించకపోవడంతో ఆధార్, ఓటు బదిలీ కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఒక్క రేషన్ మాత్రం శెట్టివారిపల్లెకు బదిలీ చేశారన్నారు. ఎన్నోసార్లు ఆధార్, ఓటు బదిలీకి దరఖాస్తు చేసుకున్నా రిజక్ట్ అవుతోందన్నారు. తమకు శాశ్వత ఇంటి నంబర్ కేటాయించి, ఆధార్, ఓటు బదిలీ చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి,గురివిరెడ్డి, పెద్దిరెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం గ్రామం వద్ద శుక్రవారం జాంబవంతుని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పూజలు చేశారు. విగ్రహదాత కేపీ హరి రాయల్, ధర్మాపురం ప్రజలు పాల్గొన్నారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి : ఏవో

ఎర్రగుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని పొందేందుకు రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని ఏవో శ్రీకాంత్‌రెడ్డి రైతులను కోరారు. రైతులు మూడు రకాలుగా ఈ బీమా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. బ్యాంకుల్లో రైతులు లోన్ రెన్యువల్ ద్వారా చేసుకోవచ్చునన్నారు. లోన్ లేని రైతులు కామన్ సర్వీసు సెంటర్ ద్వారా, రైతులు స్వయంగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో చేసుకోవచ్చునన్నారు. రైతులు ప్రీమియం చెల్లించేందుకు వెళ్లేటప్పుడు 1బీ, ఆధార్ కార్డు,బ్యాంకుఖాతా జీరాక్స్, మొబైల్ నెంబరు, కౌలు రైతు అయితే సీసీఆర్‌సీ కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలన్నారు.

● **ఏ పంటలకు ఎంత చెల్లించాలి:** బుడ్డ శనగకు ఎకరాకు రూ.480, మినుముకు రూ.285, పెసరకు రూ.270, నువ్వులు రూ.180, వేరుశనగకు రూ.480, జొన్నకు రూ.315, పొద్దుతిరుగుడుకు రూ.300, వరికి రూ.630 ప్రీమియం చెల్లించాలని ఏవో తెలిపారు. అన్ని పంటలకు ప్రీమియం డిసెంబరు 15తేదీలోగా, వరికి మాత్రం డిసెంబరు 31లోపు ప్రీమియం చెల్లించాలని తెలిపారు.

'వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి'

జమ్మలమడుగు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు చంద్రబాబు వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం జమ్మలమడుగులోని ఎన్జీవో హోంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రాగానే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: ఎన్నికల్లో అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామన్న హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుపుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు, వినయ్ పాల్గొన్నారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

బి కోడూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ కీటకజనిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా వైద్యాధికారి కె. నాగరాజు సూచించారు. శుక్రవారం బి.కోడూరు మండలంలో జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో జిల్లా వైద్యాధికారి నాగరాజు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్ కిరణ్‌రాజు, జిల్లా అదనపు మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రమణ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణలు తొలగింపు

బద్వేలుటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో ఎక్కడ ఆక్రమణలు ఉన్నా వెంటనే తొలగిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. శుక్రవారం పోరుమామిళ్ల రోడ్డులోని కూరగాయల మార్కెట్ నుంచి బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీ చివరి వరకు ఉన్న ఆక్రమణలను తొలగించారు. రెండు రోజుల క్రితం స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్, పోలీసు అధికారులు చెప్పినప్పటికీ గడువు పూర్తికావడంతో అధికారులుఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగించారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

చాపాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను డీఈవో మీనాక్షి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, తరగతి గదులను, నిద్రించే రూములను పరిశీలించారు. బాలికలకు పెడుతున్న భోజనం, వంటలను పరిశీలించారు. బాలికలకు చదువు ఏ విధంగా బోధిస్తున్నారని స్పెషల్ ఆఫీసర్ నాగలక్షుమ్మను అడిగి ఆమె వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈవో వంశీ కృష్ణ ఉన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం...



సూచనలు ఇస్తున్న అధికారులు

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని సురేంద్రనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికా రులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుంతపల్లె వార్డు సచివాలయ పరిధిలో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, కౌమార బాలికలకు రక్తహీనత, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్, జిల్లా గణాంక అధికారి రమేష్‌రెడ్డి, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు అరుణకుమారి, డీపీఎంయూ నారాయణ, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ హరినాథ్, ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ అధికారి రాజశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల శాతాన్ని పెంచండి



మాట్లాడుతున్న డాక్టర్ కె. నాగరాజు

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల శాతాన్ని పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు 10 కాన్పులు జరగాలని, ఇందుకు సంబంధించి 108, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ స్టాఫ్ అందరూ ప్రతి గర్భిణులకు అవగాహన కల్పించి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్, డాక్టర్ జె.వినయ్‌కుమార్, మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పించాలి

కొండాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు అన్నివిధాల రక్షణ కల్పించాలని సీడీపీఓ ముంతాజ్‌బేగం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసం గ్రామస్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 11 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల కిశోర బాలికలకు తనను తాను రక్షించుకోనేందుకు తల్లిదండ్రులు ధైర్యం చెప్పాలన్నారు. ఎంపీడీవో నాగప్రసాద్, మహేష్, ఎంఈవోలు ఓబులేసు, రామయ్య , అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, ఎంపీహెచ్‌ఈవో ధనలక్ష్మి, ఏఎన్‌ఎం నాగరాణి, మహిళాపోలీసులు అంగనవాడీవర్కర్లు పాల్గొన్నారు.

వరి రైతులకు ఊరట

ఎకరాకు 35బస్తాలు దిగుబడి ● ఆశాజనకంగా రేటు

రాజుపాలెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో కుందూ ప్రాంతం వెంబడి వరిసాగు చేసిన రైతులకు ఈ ఏడాది కాస్త ఊరట లభించింది. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడితో పాటు బస్తా ధర రూ.1600 పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో సకాలంలో వర్షాలు లేకపోవడంతో పాటు దిగుబడి రాక వరి రైతులు ఆందోళన చెందేవారు.ఈ ఏడాది సకాలంలోవర్షాలు పడడంతో పాటు కుందూలో పుష్కలంగా నీరు ఉండడంతో వాతావరణం కూడా అనుకూలించింది. మండలంలోని కొమ్మరిపల్లె, కూలూరు, కొట్టాల, టంగుటూరు, తొండలదిన్నె, వెలివలి గ్రామాల్లో దాదాపు 600 ఎకరాల పైబడి వరి సాగు చేశారు. మార్కెట్లో బాగా విలువన్న ఎన్‌డీఎల్‌ఆర్ రకాన్ని సాగు చేశారు. పచ్చి వడ్లనే బస్తా రూ.1600 కొనుగోలు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఎకరా సాగుకు రూ.30,000 ఖర్చు వస్తుందని రైతులు పేర్కొన్నారు.

